అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

- మున్సిపల్ అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 13: మంచిర్యాల, నస్పూర్, లక్షెట్టిపేట మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే కే ప్రేమ్‌సాగర్‌రావు అధికారులకు సూచించారు. బుధవారం మంచిర్యాలలోని తన నివాసంలో నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీల అధికారులు, పబ్లిక్‌హెల్త్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పట్టణాల్లో ప్రతిరోజూ పరిశుభ్రమైన తాగునీరును అందించాలన్నారు. ఇండ్ల నిర్మాణాలకు అనుమతుల విషయంలో పారదర్శకంగా ఉండాలని, కమర్షియల్ బిల్డింగ్‌ల నిర్మాణాల విషయంలో నిబంధనలు అమలయ్యేలా చూడాలని, తప్పకుండా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యుత్ దీపాలు, పారిశుధ్యం విషయంలో ఇబ్బంది లేకుండా చూసుకోవాలని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, ఇప్పటివరకు టెండర్లు పూర్తయి నిధులు వచ్చి ఉన్న పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని, ఎక్కడైనా నిధుల సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతి నెలా అభివృద్ధి పనులపై సమీక్షిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ గంగాధర్, డీఈ శ్రీనివాస్, మంచిర్యాల, నస్పూర్, లక్షెటిపేట మున్సిపాలిటీల కమిషనర్లు మారుతీ ప్రసాద్, టీ రమేశ్, కే రాజశేఖర్, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ విభాగాల అధికారులున్నారు.

మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

తాగు, సాగు నీటికి ఇబ్బంది లేకుండా చూస్తా

హాజీపూర్, డిసెంబర్ 13 : మంచిర్యాల, నస్పూర్ పట్టణాలకు తాగునీరు, మండల రైతులకు సాగునీటికి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుంటానని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. బుధవారం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇన్‌టెక్‌వెల్, ప్రాజెక్టులోని నీటి మట్టాన్ని, మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి నుంచి మంచిర్యాల పట్టణానికి, నస్పూర్‌కు శుద్ధ జలాలను ప్రతి రోజూ అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల అవసరానికి అనుగుణంగా సాగునీటిని అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఒడ్డె బాలరాజు, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ మధుసూదన్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఈఈ స్వామి, గూడెం లిఫ్ట్ ఈఈ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 13: మంచిర్యాల పట్టణంలోని ఐసీడీఎస్ అశోక్‌రోడ్ సెక్టార్ రాజీవ్‌నగర్ – 2 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ, అంగన్‌వాడీ టీచర్ సీహెచ్ మాధవి, ఆయా ఫర్జానాబేగం ఆధ్వర్యంలో చిన్నారుల తల్లిదండ్రుల సమక్షంలో ఈ కార్యక్రమాలను ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన, రెండున్నరేళ్లు నిండిన పిల్లలకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. 30 నెలలు నిండిన పిల్లల వివరాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూపర్‌వైజర్ రమ తెలిపారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం చేపిస్తున్న అంగన్‌వాడీ టీచర్, కుటుంబసభ్యులు →

తలసేమియా వ్యాధిగ్రస్తుల సమస్యలపై వినతి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

మంచిర్యాల ఏసీసీ, డిసెంబర్ 13 : తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల సమస్యలపై మంచిర్యాల జిల్లా తలసేమియా వెల్ఫేర్ సొసైటీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావుకు తన నివాసంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు పూర్తిగా నయంకావడానికి బోన్‌మారో మార్పిడి చేయించాలని లేదా అర్హులందరికీ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా బోన్‌మారో మార్పిడి చికిత్స అందించాలని పేర్కొన్నారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ చందూరి మహేందర్, కమిటీ సభ్యులు వీ.మధుసూదన్ రెడ్డి, సత్యపాల్ రెడ్డి, ఎస్ నాగేందర్, ఎడ్ల కిషన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌ను కలిసిన తహసీల్దార్

జన్నారం, డిసెంబర్ 13 : ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను జన్నారం తహసీల్దార్ వేణుగోపాల్ బుధవారం ఆయన క్యాంప్ ఆఫీస్‌లో మర్యాదపూర్వంకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఈశ్వర్

లక్షెట్టిపేట, డిసెంబర్ 13: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా లక్షెట్టిపేట పట్టణానికి చెందిన ఈశ్వర్‌ను నియమించారు. ఈనెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన ఏబీవీపీ 42వ రాష్ట్ర మహాసభల్లో ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి ఈశ్వర్‌ను నియమించినట్లుగా నియామకపత్రాన్ని బుధవారం పోస్టులో పంపించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ముందుంటానని తెలిపారు. పదవి అప్పగించేందుకు ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపిక

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 13 : మంచిర్యాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం సీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎల్ సుప్రజ అంతర్ విశ్వవిద్యాలయ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డీ సుమతి బుధవారం తెలిపారు. ఈ నెల 11న కాకతీయ యూనివర్సిటీలో అంతర్ విశ్వ విద్యాలయాల టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు జరుగగా సుప్రజ ఎంపికైందని, చెన్నైలోని అమెట్ యూనివర్సిటీలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. సుప్రజను వైస్ ప్రిన్సిపాల్ కే శివలీల, అధ్యాపకులు అభినందించారు.

ఎల్ సుప్రజ

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

దండేపల్లి, డిసెంబర్13:దండేపల్లి మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పథకానికి సంబంధించి నేడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మల్లేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించాయని, ఈ తనిఖీలో గుర్తించిన అంశాలను సామాజిక తనిఖీ ప్రజావేదిక ద్వారా బహిర్గతం చేయనున్నట్లు వివరించారు.

అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ రిన్సీ

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 22: వరంగల్‌లో ఈ నెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పట్టణంలోని కార్మల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రిన్సీ బుధవారం తెలిపారు. అండర్–14 విభాగంలో 80 మీటర్ల పరుగు పందెంలో సుశృత ప్రజ్వల బంగారు పతకం సాధించిందని, సిరింగా చౌదరి 100 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం గెలుచుకున్నారని తెలిపారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు ఉత్తర్‌ప్రదేశ్ లక్నోలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. 4/100 రిలే పరుగు పందెంలో సుశృత ప్రజ్వల, సిరింగా చౌదరి సిల్వర్ మెడల్ సాధించి ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు ఉత్తర్ ప్రదేశ్‌లోని లక్నోలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రిన్సీతో పాటు, వైస్ ప్రిన్సిపాల్ టిస్సి, లిల్లీ, కోచ్ అనిల్ కుమార్, పీఈటీలు సుకుమార్ ఫ్రాన్సిస్, చిరంజీవి, శ్రీలత, ఉపాధ్యాయులు అభినందించారు.

బీఆర్ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దివాకర్‌రావు

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 13: నస్పూర్ మున్సిపాలిటీలోని సుభాష్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అమృత రాజ్‌కుమార్ తండ్రి అనారోగ్యంతో మరణించడంతో ఆయనను మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు పరామర్శించారు. జమ్మికుంటలో నివాసముండే రాజ్‌కుమార్ తండ్రి ఇటీవలే అనారోగ్యంతో చనిపోయాడు. మృతదేహాన్ని సీసీసీ సుభాష్‌నగర్‌కు తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, విజిత్‌రావు బుధవారం సాయంత్రం రాజ్‌కుమార్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని ప్రకటించారు. ఆయన వెంట నాయకులు చిట్యాల అశోక్, చెరుకు అజయ్, రాజరాం, తదితరులు ఉన్నారు.

నోట్‌బుక్స్ అందజేత

నోట్‌బుక్కులు అందజేస్తున్న హెచ్ఎం

దండేపల్లి, డిసెంబర్13: దండేపల్లి మండలంలోని తాళ్లపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గూడెం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కమలాకర్ నోట్‌బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు, విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత గ్రామమైన తాళ్లపేట విద్యార్థులకు సహాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుడిమెత శ్రీనివాస్, అడాయి సంపత్, బిక్కు, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి గీతా ప్రశాంతి నిలయం రజతోత్సవాలు

శ్రీరాంపూర్, డిసెంబర్ 13: శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 6కాలనీలోని గీతా ప్రశాంది నిలయం 25వ రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నామని శ్రీ మత్ భగవద్గీత సత్సంగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు దాసరి రాజేశం పేర్కొన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో రజతోత్సవల వివరాలు వెల్లడించారు. ఈ నెల 14 నుంచి 23 వరకు ఆర్కే 6కాలనీ గీతా ప్రశాంతి నిలయం 25వ రజతోత్సవాలు, గీతా జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు శ్రీ విష్ణు సేవానందగిరి స్వామి, రోటిగూడ శ్రీహరి మౌనస్వామి హాజరవుతున్నారని పేర్కొన్నారు. 14వ తేదీన 52వ గీతా జ్ఞాన సప్తాహ, 20న మహాత్ములు గురువుల పాదపూజ, మాలాధారణ, భక్తుల కోలాటాల నృత్యాలతో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. 21న సామూహిక లక్ష్మీ పూజలు, పారాయణాలు నిర్వహిస్తామన్నారు. 22న, 23 అభిషేకాలు, గీతా హవణ యజ్ఞం, గీతా ప్రవచనాలు, ఉపన్యాసాలు, అన్నదానాలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ మత్ భగవద్గీత సత్సంగ్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి డీడీ ప్రసాద్, రాజమౌళి, లక్ష్మీనారాయణ, సభ్యులు ఎం సారయ్య, శ్రీనివాస్, సమ్మయ్య, మనోహర్, వెంకటేశం, రాంచందర్, రాంబాబు, ఆర్ మల్లేశం, స్వర్ణకుమారి, రమాదేవి, వినోద, సత్యవరి, మాధవి, పద్మ, లక్ష్మి, అనసూయ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో పీఈటీ గాజుల శ్రీనివాస్

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 13: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు చెన్నూర్ మండలంలోని ఆస్నాద్ జడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ గాజుల శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణ పేట పట్టణంలో ఈ నెల 13వ తేదీ నుంచి అండర్ బాల బాలికల ఎస్‌జీఎఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జట్టుకి చెన్నూర్ మండలం ఆస్నాద్ పాఠశాలలోని విద్యార్థులు జీ జెశ్వంత్ 9వ తరగతి, జీ వర్షిణి, 7వ తరగతి, ఎం నక్షత్ర 7వ తరగతి నుంచి ఎంపికయ్యారని శ్రీనివాస్ తెలిపారు. వారిని పాఠశాల హెచ్ఎం అనురాధ అభినందించారు.